క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్ఓ వెంకటేష్

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సీహెచ్ఓ వెంకటేష్ హెచ్చరించారు. ఆయన ఆర్.అనంతాపురం గ్రామంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంతవరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు



బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కారణంగా ఆగిపోయిన వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రం బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్ రోడ్డులో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించడం లేదు. దీనికితోడు పలువురు ఆటోవాలాలు రోడ్డుకు అడ్డంగా ఆటోలను ఉంచుతున్నారు. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలోనే వాహనాలుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న ప్రియదర్శిని

ఏర్పేడు: గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలిద్దామని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని అన్నారు. మండలంలోని మడిబాక ఎస్టీ కాలనీలో గురువారం గ్రామస్తులకు బాల్య వివాహాలపై అవగాహనా కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అవగాహనా లోపంతో బాల్యవివాహాలు చేస్తున్నట్లు వివరించారు. బాల్యవివాహాలతో జన్మించే పిల్లలు అంగవైకల్యం, అనారోగ్యంతో ఉంటారని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయ, ప్రగతి సంస్థ ప్రతినిధి కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దాలు

నాగలాపురం: మండల కేంద్రంలోని రాజులకండ్రిగ సమీపంలో నాగలాపురం నుంచి సత్యవేడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. సత్యవేడుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో డ్రైవర్ బస్సును కంట్రోల్ చేయలేకపోయాడు. దీంతో బస్సు అద్దాలు పగిలి డ్రైవర్‌కు చిన్న గాయాలు అయ్యాయి. అతన్ని స్థానికులు నాగలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెంకన్నకు నృత్య నీరాజనం



మహతి కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నగరంలోని పలు కళా వేదికలపై కళాకారులు, సంగీత, నృత్యాభినయాలతో గరుడ వాహనదారుడైన వెంకన్నకు ఘన నీరాజన పలికారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి వేదికలపై సంగీత, నృత్య, నాటక, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మహతిలో జయలక్ష్మీ, జితేంద్ర కళాబృందం ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అన్నమాచార్య కళామందిరంలో అరవింద్ ఆర్ట్స్ అకాడమీ వారి నృత్యాభినయం భక్తి పారవశ్యంగా సాగింది. శ్రీరామచంద్ర పుష్కరిణి కళా వేదికపై ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు కీర్తి, తేజశ్వి ఆలపించిన భక్తి సంకీర్తనలు సభికులను అలరింపజేశాయి.

కైలాసనాథకోనలో లలితాత్రిపుర సుందరిగా కామాక్షాంబిక అమ్మవారు, కరిమారియమ్మగా అవనాక్షమ్మ, పార్వతీదేవిగా ద్రౌపదీదేవి, బుచ్చినాయుడుకండ్రిగలో.., వరదయ్యపాళెం: లలితాదేవిగా చెంగాళమ్మ, శ్రీ కామాక్షి అలంకరణలో మరగదాంబిక అమ్మవారు








జగజ్జననీ.. దివ్యస్వరూపిణి..

- అట్టహాసంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు

నారాయణవనం: జగజ్జననీ కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. అందులో భాగంగా గురువారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు కరుమారియమ్మగా భక్తులకు ఊంజల్ సేవలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు. మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలో కామాక్షాంభిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు లలితాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో సాయంత్రం ద్రౌపదీదేవి పార్వతీదేవి అలంకరణలో ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

గాయత్రీదేవిగా పచ్చాలమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పల్లమాల గ్రామంలో పచ్చాలమ్మ అమ్మవారు గురువారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టి పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వరదయ్యపాళెంలోని శ్రీచెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఈశ్వరయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం: పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రోజు ఉభయదాతలుగా కారణికి చెందిన మాధవి, ఢిల్లీబాబు, మునిరత్నం వ్యవహరించారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ ఏపీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి (బాలాజి రెడ్డి), పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, జి.మునివేలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఐదో రోజు గురువారం పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు అశ్వాసుర వధ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ విశేష పూజలు చేసి, అమ్మవారిని ఆలయంలోని రంగులు గోపురం వరకు ఊరేగించారు. ఇక ఆలయంలో బొమ్మల కొలువులో ఏర్పాటు చేసి అమ్మవారు స్కంధమాతగా దర్శనమిచ్చారు. ఆలయంలో కనకదుర్గమ్మ, కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకారంలో కొలువుదీరారు. ఇక పట్టణంలోని సంతామైదానం అంకాళమ్మ పసుపుకొమ్ముల అలంకారం, మూకేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు ప్రత్యేక అలంకారం, పానగల్‌లో వెలసిన గంగమ్మ ధనలక్ష్మిగా, ఏడుగంగల అమ్మవారు స్కంధమాతగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీనివాస పెరుమాల్ గరుడసేవ అలంకారంలో, భాస్కరపేటలోని చాముండేశ్వరి దేవి మహాలక్ష్మిగా, ముత్యాలమ్మ శీతాలాంబగా దర్శనమిచ్చారు.



విద్యుత్ కాంతులతో కనకాచలం



స్కంధమాతగా ఏడుగంగల అమ్మవారు

లలితా దేవిగా రాజరాజేశ్వరీ దేవి


ఏర్పేడు: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం మండలంలోని మల్రిమంద మాతా సేవాశ్రమం రాజరాజేశ్వరీ దేవి లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. పాపానాయుడుపేట భద్రకాళి, అంజిమేడు గంగమ్మ, గుడిమల్లం ఆనందవల్లీ దేవి, చిందేపల్లిలో పార్వతీసమేత సిద్ధేశ్వర స్వామి, మూలకండ్రిగ ఓసూరమ్మ తదితర ఆలయాల్లో అమ్మవారికి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



మహాచండీగా ముత్యాలమ్మ







మహాలక్ష్మిగా నల్లగంగమ్మ, ప్రత్యంగిరా దేవిగా బహదూరుపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు, మల్రిమందలో లలితాదేవిగా రాజరాజేశ్వరి దేవి, మహాలక్ష్మిగా చాముండేశ్వరి, స్కంధమాతగా జ్ఞానప్రసూనాంబ








శ్రీకాళహస్తి: లలితాదేవిగా కనకదుర్గమ్మ, బ్రహ్మచారిణిగా బంగారమ్మ, గరుడసేవ అలంకారంలో కన్యకాపరమేశ్వరి, మహాలక్ష్మిగా పొన్నాలమ్మ, మీనాక్షి దేవిగా బీపీఅగ్రహారం చిన్న గంగమ్మ, అశ్వాసుర వధ అవతారంలో ఆలయంలోని జ్ఞానప్రసూనాంబ

శ్రీకాళహస్తిలో యూబీఐ రుణమేళా

శ్రీకాళహస్తి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజరు రాంప్రసాద్ అధ్యక్షతన రుణమేళా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలాలకు చెందిన వివిధ రకాల జీవనోపాధుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అవసరమైన పథకాల ద్వారా ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈఎం, ఎస్ఎం కింద యూనియన్ బ్యాంకు వారు రుణాలు మంజూరు చేశారు. యూనియన్ బ్యాంకు సెంట్రల్ ఆఫీస్ నుంచి జనరల్ మేనేజరు జ్ఞానరంగ్ సారంగి హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజరు డి.శ్రీనివాస, ఎల్డీం ఆర్ సుభాష్, చీఫ్ మేనేజరు శ్రావణ సంధ్య, డీఆర్‌డీఏ ఏడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, శ్రీకాళహస్తి పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు, మేనేజర్ హరికృష్ణ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

సుబ్రమణ్యంరెడ్డి కుటుంబానికి పరామర్శ

పిచ్చాటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వి.సుబ్రమణ్యం రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. సుబ్రమణ్యం రెడ్డి తల్లి శకుంతల రెండు వారాల క్రితం మరణించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పిచ్చాటూరులోని సుబ్రమణ్యం రెడ్డి ఇంటికి చేరుకుని శకుంతల చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుమారులు సుబ్రమణ్యం, వెంకటేశన్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటచలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

స్వర్ణముఖిని తవ్వేస్తున్నారు




వేదాంతపురం వద్ద మామిడితోటల్లో ఇసుక అక్రమ రవాణా, ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని సెబ్, రెవెన్యూ అధికారులు

తిరుపతి రూరల్: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. మండలంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిని ఇసుకాసురులు చెరబట్టారు. ముఖ్యంగా సీగొల్లపల్లి, దుర్గసముద్రం, చిగురువాడ, వేదాంతపురం పంచాయతీల పరిధిలో ట్రాక్టర్ల ద్వారా జోరుగా అక్రమ రవాణా చేస్తున్నారు. మామిడి తోటల్లోకి సైతం చొరబడి రాత్రికి రాత్రే 20 అడుగులకు పైగా ఇసుకను తోడేస్తున్నారు. దీంతో ఏళ్ల వయస్సు ఉన్న చెట్లు కూలిపోయి, చచ్చిపోతున్నాయి. ముఖ్యంగా వేదాంతపురం, తనపల్లి పంచాయతీల్లో ఈ అక్రమ రవాణా ఎక్కువగా ఉంది. గ్రామస్థాయి వీఆర్వోలు, కింది స్థాయి సెబ్ సిబ్బంది అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ధరణి డిపాజిట్‌తో అధిక వడ్డీ

వరదయ్యపాళెం: ధరణి డిపాజిట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంకు వరదయ్యపాళెం బ్రాంచ్ మేనేజరు రమేష్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక డీసీసీ బ్యాంకులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పథకం ద్వారా సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. కనిష్ఠ డిపాజిట్ రూ.వెయ్యి నుంచి స్వీకరిస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇతర బ్యాంకుల కంటే అధిక వడ్డీ పొందవచ్చన్నారు. డిపాజిట్‌కు డీసీజీసీ ఇన్సూరెన్సు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని డీసీసీ బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడి రైతులకు అవగాహన

భాకరాపేట: వర్షాధార మామిడిలో హైడ్రోజెల్ వాడకంతో మొక్క మొదలలో ఎక్కువ రోజులు తేమ శాతం ఉంటుందని రాస్ ఉద్యానవన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ తెలిపారు. గురువారం చిట్టెచెర్ల పంచాయతీ పరిధిలోని మామిడి రైతులకు రాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క మామిడి చెట్టుకు పూసా హైడ్రోజెల్ గుళికలను 125 గ్రాములు చొప్పున వేయాలని సూచించారు. దీంతో బెట్ట పరిస్థితుల్లో కూడా చెట్టు త్వరగా చిగుళ్లు వేసి మంచి పూతకు వస్తుందని తెలిపారు.

21న మహతిలో బహురూప కళా విన్యాసం



మాట్లాడుతున్న మృదంగ విద్వాంసుడు పీఎస్‌వీ మురళీకృష్ణ

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నారాయణతే నమో నమో సంకీర్తన బహురూప కళా విన్యాస ప్రదర్శన చేపడుతున్నట్లు మృదంగ విద్వాంసుడు పీఎస్‌వీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వినూత్న రీతిలో నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తనను ఒకే వేదికపై విభిన్న రాగాలలో 13 కళారూపాల ద్వారా 65 మంది కళాకారులతో ఈ మహోత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు కళాకారుడు కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే సురక్ష ధ్యేయం



కిట్లు అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై

సత్యవేడు: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం చెరివి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రుయా ఆస్పత్రి డాక్టర్లు వంశీకృష్ణ, గైనకాలజిస్టు మహాలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్లు గుణశేఖర్, లావణ్య 532 మంది రోగులకు పరీక్షించి మందులు అందజేశారు. 18 మందికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, సచివాలయ కార్యదర్శి ప్రకాష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, జగనన్న సురక్ష కార్యక్రమ అధికారి బేబిరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్ అన్నారు. మండల కేంద్రంలోని నాగలాపురం సచివాలయం–2లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 492 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు అపరంజిరాజు, నాగలాపురం పంచాయతీ సర్పంచ్ చిన్నదొరైసుధ, జెడ్పీటీసీ సుమతి, ఎంపీపీ సింధూశ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి, తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పీకేఎం బాబు, వైస్ సర్పంచ్ సునీత, వైద్యాధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో 'గరుడోత్సవ' సేవలు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి గరుడోత్సవం సందర్భంగా తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌లో గురువారం ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానంగా ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలకు వెళుతున్న భక్తులకు, ఆర్టీసీ ఉద్యోగులకు పాలు, టీ, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్‌ను తిరుపతి డీపీటీవో చెంగల్‌రెడ్డి, చిత్తూరు డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కేసీ రెడ్డి, బలరాం, ప్రకాశం ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఎంప్లాయ్ అసోసియేషన్ నేతలు అర్జునయ్య, నరసింహులు, తులసీరెడ్డి, రాంబాబు, మస్తాన్ పాల్గొన్నారు, అంతేకాకుండా తిరుపతి డెప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం రామచంద్రనాయుడు, కార్గో జిల్లా మేనేజర్ సురేంద్రబాబు, డీఎం బాలాజీ, శ్రీకాళహస్తి డీఎం రాజవర్ధన్‌రెడ్డి, మంగళం డీఎం భాస్కర్‌రావు, అసిస్టెంట్ డీఎం నిర్మల తదితరులు హాజరయ్యారు. మరోవైపు ఆర్టీసీ బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతృత్వంలో భక్తులకు,ఉద్యోగులకు రొట్టె, పాలు తిరుపతి డీపీటీవో చెంగల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనందయ్య, జిల్లా అధ్యక్షుడు పరశురాం, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు ఎంవీఎస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పాలు, బిస్కెట్లు పంపిణీ